# ఇది సమయం కాదు

పదేళ్ల తర్వాత అమ్మను చూడాలనే వచ్చిన మధు స్టేషన్‌లో రైలు దిగి, గుంటూరు చూడగానే అమ్మను చూచి నట్లు అనిపించింది.

స్టేషన్ ఎంతో మారిపోయింది. అంతా కొత్తగా వుంది. ఆ మార్పు మధుకు నచ్చలేదు. పూర్వం ఎలా వుందో ఇప్పుడూ అలాగే వుంటుందని కొండంత ఆశతో చూస్తే అంత విచిత్రంగా కనిపించింది. ఎంతలో ఎంత మార్పు.

గుంటూరు హృదయంమీద పసితనంనుంచి ఆడుకొన్న మధు, పరాయివాడులాగా నిలబడిపోయాడు. ఇప్పుడీ వూరు మా వూరు కాదనుకొన్నాడు. విచారంగా వెలపలికి వచ్చాడు.

ఆరేళ్ల క్రితం ఎంతో మంది స్నేహితులు కనిపించే ప్రదేశంలో ఇప్పుడు తెలిసిన ముఖం ఒక్కటైన లేదు. హోటల్లో కాఫీ తాగుతూ పూర్వం సొంత ఇంటిలో తాగుతున్నంత తృప్తిపడే మధు, ఆ రోజు పరాయివాళ్ల ఆతిథ్యం సిగ్గుతో స్వీకరించినట్లు బెదురుగా కాఫీ తాగి బైటకు వచ్చాడు.

అమ్మను చూడగానే ఏడుపు వచ్చినంత పనయింది. అమ్మ లోనూ ఎంతో మార్పు! వృధ్ధాప్యపు ఛాయలు అమ్మను

ఆవరించుకొన్నాయి. లంకంత యింటిలో ఒక్కతే వుండటం ఆ ఒంటరితనం అమ్మమీద మరింత ప్రభావం చూపింది.

నువొక్కడివే ఇక్కడుండటం ఎందుకు? నాతోపాటు అక్కడే వుంటే పోలేదా అంటే నేనీ గడపదాటిరాను, నా జీవితం ఇక్కడ తెల్లవారవలసిందే అంటుంది అమ్మ. ఎంతకూ ఒప్పించలేకపోయాడు మధు.

దూరంగా భార్యా పిల్లలతో ఉద్యోగం చేసుకొంటున్న మధు ఆలోచనలు అమ్మను విడిచిపెట్టకుండా గుంటూరులోనే వుంటాయి. అయితే ఏం లాభం? సెలవు దొరకదు. దొరికినా రావటానికి వీలుపడదు. ఎప్పుడూ యింటిపట్టున వుండని భర్త ఆ రోజు యింటిదగ్గరుంటే ఎక్కడకూ పోనీదు భార్య నాలుగు రోజులు ఎప్పుడయినా సెలవు దొరికితే ఎప్పుడూ ఇంటిలో వుండే భార్యా పిల్లలు ఏవూరు అయినా తీసుకుపోయి చూపించమంటారు. గుంటూరు పోవాలంటే మధుకు ఎంత ఆశో, అంత నిరాశకూడా వుంది.

ఒక నెలయినా వుంటావుగదరా అని అడిగితే వీలుండనీ పదిరోజు లుంటానని మధు చెప్పాడు.

కోడల్నీ పిల్లల్నీ తీసుకురాలేదేమని అడిగితే, వాళ్లు ఆరు నెలల క్రితమే వచ్చిపోవటం, ఆమె నిండునెలలతో వుందటం చెప్పి, ఒంటరిగా అవస్థపడుతుంది. వీలయినంత త్వరగా వెళ్లిపోతానంటూ ఏకరువు పెట్టాడు మధు.

వాసు, రాజు, మూర్తి ఇంకా ఎందరో స్నేహితులు. పూర్వం ప్రతి సాయంకాలం అందరూ ఎక్కడో ఒకచోట కలుసుకొని సరదాగా తిరిగేవాళ్లు. ఇప్పుడూ వాళ్లంతా

గుంటూరులోనే వున్నారు. అయితే మునుపటిలాగ వాళ్లకు సాయంకాలం తీరుబడిగా తిరుగటానికి అవకాశం లేదు.

అందరూ పెళ్లిళ్లు జేసుకొన్నారు. కాపురాలు ఏర్పడ్డాయి. కుటుంబ పరిస్థితులు, అవకాశాలు, గొడవలు వాళ్లను కదల నివ్వటంలేదు. యువకులుగా వున్నప్పుడు చేతినిండా స్వేచ్ఛ, కాళ్లనిండా ఓపిక, సాయంకాలం అంతా కాళీ!

ఇప్పుడు బరువు బాధ్యతల మధ్య, తను సంసారాలు తాము దిద్దుకొనే గృహస్థులు వాళ్లు, రెండు రోజుల్లోనే హృదయంలో మైత్రిభావం చెక్కు-చెదరకుండ వున్నా, సరదాగా కాలక్షేపానికి వాళ్లు సుఖంగా లేరనీ మునుపటి జీవితం మిత్రులతో, రోడ్డుమీద, సినిమా హాళ్లలో, కాఫీ హోటళ్లలో గడపే దశ తొలగిపోయిందని తెలిసి బాధ పడ్డాడు మధు.

కాలేజీకి పోతే విద్యార్థుల్లో తెలిసినవాళ్లూ ఒక్కళ్లూ లేరు. అంతా కొత్తవాళ్లు. ఆ రోజుల్లో చదువుకొన్న అందరూ, దాదాపు చాలామంది జీవితాలలో ప్రవేశించారు. ఇప్పుడు విద్యార్థులకు తనెవరో ఏమీ తెలియదు.

స్టాఫ్ రూంలో రాజు వున్నాడు. వాణ్ణి పలకరిస్తుంటే ఓ యువకుడు 'నమస్కారం సార్ అంటూ వచ్చాడు. అతన్ని చూచిన గుర్తులేదు.

'నేను మీ స్టూడెంట్‌ను సార్ ఎనిమిదేళ్లక్రితం ఇక్కడే పి. యు. సి చదివాను.'

మధుకు గుర్తురాలేదు. అయినా.

'ఇప్పుడేం చేస్తున్నావు మరి'

'రెండేళ్ల క్రితం ఇక్కడే లెక్చరరుగా చేరాను సార్.'

మధుకు ఎంతో సంతోషమయింది. కులాసాగా వాళ్ల క్లాసు కబుర్లు చెప్పుకొన్నాక అతను వెళ్లిపోయాడు.

స్టాఫ్ రూంలోంచి బైటికి చూస్తుంటే ఎంతో తృప్తి కలిగింది. ఎనిమిదేళ్ల క్రితం రెండు సంవత్సరాలు తను ఆ కాలేజీలో లెక్చరరుగా పనిజేశాడు. అప్పుడు నాటిన చెట్టు ఇప్పుడు పెద్దయింది. రాత్రి కురిసిన మంచుబిందులు ఆకుల మీద నిలచి ఆలాగే వున్నాయి. వాటిమీద పడి సూర్య కిరణాలు మెరుస్తున్నాయి.

'ఆమె తెలుసురా నీకు.'

రాజు అడిగాడు.

'ఎవరామె!'

'అటుచూడు'

చూస్తూవుండగానే వృద్ధురాలు ఒకామె లోపలికి పోయింది. సరిగ్గా చూడలేదు.

'ఎవరామె?' మధు ప్రశ్నించాడు.

'లిల్లీ టీచర్ రా'

'ఆమె ఇప్పుడేం చేస్తుంది.

'లెక్చరరు!'

'నిజమే!'

'ఆం! ప్రవేటుగా ఎం. ఏ. పరీక్షకు కట్టింది. పాసయి ఇక్కడ చేరింది.'

మధుకు ఎందుకో ఎక్కడలేని సంతోషం కలిగింది. ఆమె హైస్కూలు టీచరు. ఆమె దగ్గర మధు చదువుకొన్నాడు.

'ఆమెను పలకరిస్తానురా'

'పద!'

ఇద్దరూ లేడీ స్టాఫ్ మెంబర్సు రూంకు పోయారు.

'నమస్కారం టీచర్'

'ఎవరు నాయనా!'

'నేనండీ!' మధు పరిచయం చేసుకొన్నాడు.

విన్నాను నాయనా విన్నాను.

'కలకత్తాలో కదూ ఉద్యోగం, బాగుందా' భార్యా పిల్లలు ఆరోగ్యంగా వున్నారా? కుసల ప్రశ్నలు సాగుతూ వున్నాయి.

మధు ప్రక్కనున్న మాలతిని చూచి క్షణంసేపు స్తంభించి పోయాడు. మళ్లీ తేరుకొన్నాడు.

'బాగున్నారండీ!'

ఆమె పలకలేదు.

లిల్లీ టీచర్ మాలతిని తిట్టి 'మిమ్మల్నే' అంది.

'ఆ! ఏమిటీ! బాగున్నాను.'

ముఖం వాల్చుకొనే జవాబు చెప్పింది.

మధు టీచర్‌తో 'మీ పెద్దబ్బాయి ఏం చేస్తున్నాడండి.'

'వాడా నాయనా, హైద్రాబాదులో ఉద్యోగం. వాడికొక కొడుకు, కోడలు అంతమంచిదికాదు నాయనా, మనమరాలు కావాలంటే మనుమణ్ణి కంది. లత తెలియదూ! పెద్దమ్మాయి, మాచెర్లలోవుంది. మొన్నే పెళ్లయింది. అతను నాగార్జున సాగర్‌లో ఇంజనీరు. హాయిగా వున్నారు. మొన్న

సెలవుల్లో వెళ్లి వచ్చాను. మీ అత్తగారిది ఏవూరు అన్నావు?

'భీమవరం!'

ఆ! ఎవరో చెప్పారు. మాలతి అనుకొంటాను. ఏమమ్మా నువ్వేనా?'

'అవునండి!'

మధు మాలతితో 'మీకు అబ్బాయికదండీ!'

'అవును!'

'బాగున్నారా?'

'ఆఁ!'

'ఆయనకు రాజమండ్రిలో కదూ ఉద్యోగం.'

అవును. ఇప్పుడిక్కడే వున్నాడు.'

రాజు మౌనంగా కూర్చున్నాడు.

మధు టీచర్‌తో 'ఆయన రిటైరు అయ్యారుకదండీ!'

'అవున్నాయనా! రెండేళ్లయింది. కొంచెం చూపు తగ్గింది. అయితే ఏం సినిమాలు చూడటం మాత్రం మానలేదు.

'టీచర్‌తో మాట్లాడుతున్నంత సేపు ముఖంలోకి చూస్తున్న మాలతి, రాజు నవ్వటంతో మధు ముఖం ఎత్తేసరికి తల వాల్చేసుకొంది.

'టీచర్‌గారికి మాస్టారిమీద ఇంకా కోపమేరా.'

'చూడు నాయనా రాజు ఎలా మాట్లాడుతాడో, ఆయన్ను సినీమా చూడవద్దని అన్నానా, ఈ సినీమాలు చూచి చూచి కళ్లు పోగొట్టుకొన్నాడన్నాను. అదిసరే నాయనా పసిపిల్ల

లయినా వారానికి రెండుసార్లు సినీమాకు పోతారా! ఈయన మాత్రం కచ్చితంగా రెండుసార్లు పోవలసిందే! అన్నం తినటం ఎంత మామూలో, అత్యవసరమో ఆయనకు సినీమా అంత!'

రాజు మళ్లీ నవ్వాడు.

మాలతి మాత్రం తల ఎత్తలేదు.

మధు 'వస్తామండి' అంటే 'ఇంటికి రా నాయనా ఆయన సంతోషిస్తారు. నీ సంగతి ఎప్పుడూ తలుచుకొంటూ వుంటారు. రాజూ, మధును తీసురా!'

'ఆలాగేనండి.'

వాళ్లిద్దరూ వచ్చేస్తుంటే టీచర్ చాలా తృప్తిగా కనిపించింది. మాలతి కళ్లుమాత్రం తడికావటం మధు గమనించాడు.

ఏమిటిరా అలా వున్నావు' రాజు ప్రశ్నిస్తే యేంలేదని జవాబు చెప్పాడు మధు. అతని మనస్సంతా ఆదోమాదిరిగా చికాకు అయిపోయింది.

కేఫ్టీరియాలో కాఫీ తాగుతున్నప్పుడు, మధుకు ఆ కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు సంఘటనలు ఒకటి రెండు లీలగా హృదయంలో కదిలాయి.

మాలతి క్లాసుమేటు. లాబొరేటరీలో ఆ రోజు ఆమెతో మాట్లాడాడు. ఆవేళ సీనియర్సుకు సెండాఫ్ పార్టీ అయిపోయింతర్వాత, కిల్లీ నమిలి ఎరుపెక్కిన పెదాలతో నిలబడ్డ ఆమె, ఫేన్‌గాలికి కొట్టుకుపోతుందేమో నన్నంత సన్నగా లతలాగ వూగిపోతూ వున్నామె మధు మనఃఫలకంనుంచి తొలగిపోలేదు.

హైస్కూలులో అతిసామాన్య విద్యార్థి మధు. కాలేజీలో బ్రిలియంట్ స్టూడెంట్ కావటానికి కారణం మాలతి. ఆమెకంటే ఎక్కువ మార్కులు రావాలనే అతని పట్టుదల.

అతనికి ఆమె కనిపించటం ఆ రెండేళ్లు ఎంతో ఉత్సాహ కారణం. ఆమె ఆ సంవత్సరాలలో కాలేజీలో చదవకపోతే, తను ఎప్పటిలాగా మామూలు విద్యార్థిలాగానే, వుండిపోయే వాడిని అనుకొంటాడు.

ఆమె తప్పిపోవటంతో, ఆమెమీద కసితో, ఎం. ఎ. స్సి. మంచి రికార్డుతో పాసయ్యాననుకొంటాడు. మధు ఎప్పుడు ఏం చదువుకొంటున్నా, మాలతి వెలుగులాగో, నీడలాగో అతని గదిలో సంచరించినట్లుగా అయ్యేది. ఆమెకంటే అధికుణ్ణనీ, ఆమె అనుకోవాలి అనే అనుకొనేవాడు. అందుకు తన సామర్థ్యం విద్యా విషయంగానే వుంటుందని తన నమ్మకం. ఆ భావం మాత్రమే కాదు. ఆమెమీద కోపం రావటానికి కూడా ఒక్కటే కారణం.

ఇంటర్ పూర్తి అయిన సెలవుల్లో ఆమెకు ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు. ఒక్కదానికి ఆమె జవాబు వ్రాయలేదు. ఎంతో బాధపడేవాడు. చివరికి ఆమె ఉత్తరం వ్రాసింది.

'బుద్ధివుంటే ఉత్తరాలు వ్రాయవద్దు!' మధు విపరీతంగా బాధపడి పోయాడు. బుద్ది వుందని నిరూపించుకున్నాడు.

అయితే ఆమె పలకరించవద్దు అనలేదు. కాబట్టి చాలాసార్లు పనిగట్టుకొని ఆమెకు పలకరించ బోయాడు.

రెండుసార్లు పలకలేదు. మూడోసారి, మాత్రం కఠినంగా చెప్పింది.

'బుద్ధివుంటే నన్ను పలకరించవద్దు!'

ఆమెను పలకరించలేదు ఆపైన ఎప్పుడూ! ఆమెను చూడందే ఉండలేక పోయేవాడు. వీలుకలిగినప్పుడు ఎక్కణ్ణుంచో ఆమెను చూస్తూ నిలబడిపోయేవాడు.

అదీ ఆమెకు చిరాకు కలిగించింది. ఒకరోజు పిలిచి చెప్పింది.

'బుద్ధివుంటే నన్ను చూడకు. నాకు కనబడకు.'

ఏడ్చి ఏడ్చి గుండె నీరుగారి, అతనిలో ప్రతీకారంవంటిది తల ఎత్తింది. అదే కసి! అదే కోపం! అయితే అతనిలో మార్పువల్ల ఆమెకు ఏ కష్టం కలగలేదు. అతనికి లాభం కలిగింది.

ప్రేమించటం అంత తెలివితక్కువ జీవితంలో ఏమీ వుండదనిపించింది.

ఆరేళ్ల క్రితం, కాలేజీ లెక్చరరు ఉద్యోగం మానేసి, కలకత్తాలో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసరుగా చేరిన కొద్ది రోజులకు, పెళ్లి సంబంధం ఖాయంచేసి, అమ్మ రమ్మని వ్రాసినప్పుడు—పిల్లను చూడటానికి బయలదేరేముందు, ఎవరో వ్రాసిన ఉత్తరం వచ్చింది.

ఆ లేఖలో మాలతి నీతో మాట్లాడలనుకొంటుందనీ, ఎప్పుడు బయలుదేరుతూ వుంది లేఖ వ్రాయమనీ ఉంది.

మాలతి ఎవరిచేతో అలా వ్రాయించటం మధుకు నచ్చలేదు. ఆమె వ్రాస్తే ఎంత బాగుండేది అనుకొన్నాడు.

భీమవరం పోయి, ఆమెను చూచి, గుంటూరు వచ్చి, మాలతిని చూడబోతే, నాకోసం ఎవరయినా వస్తే మావూరు

రమ్మని చెప్పండి అని వార్డనుతో చెప్పి వెళ్ళిపోయింది. మధు తల్లితో భీమవరం సంబంధం ఖాయం చేసుకొన్నామని వ్రాయ మనిచెప్పి, కలకత్తా వెళ్ళిపోయాడు. అప్పుడామె కాలేజీలో లెక్చరరుగా చేరింది. హాస్టల్లో వుంటూవుంది.

నెలకు కలకత్తా ఉత్తరం వ్రాసింది మాలతి. 'మీతో చాల సంగతులు మాట్లాడాలి వెంటనే రండి' అని, అప్పటికి పెళ్ళి కార్డులు అచ్చయి ఎవరెవరికో పంపే తొందరవుండి మధు వెళ్ళలేదు.

నాకీ జీవితం నువ్వు పెట్టిన బిక్ష. ఈ బిక్షను నువ్వు ఆశిస్తావని నేను అనుకోను, నాలో ప్రేమించే శక్తిని పెంచి పెద్దచేసి త్రుంచివేశావు నువ్వు. ఇక నేను ఏ స్త్రీని ప్రేమించ లేకపోయాను. మా అమ్మకోసం పెళ్ళి చేసుకొంటున్నాను అని వ్రాసి, పెళ్ళికార్డు పంపబోతూ ఉత్తరం చించి పారేసి, కార్డు మాత్రమే పంపాడు మధు.

'ఏమిటిరా దీర్ఘాలోచనలో పడ్డావు. కాఫీ చల్లారిపోతూ వుంది. కానీ,' రాజు హెచ్చరించాడు.

గతం గుండెల్లో కలక వేస్తుంటే మాలతిని తలుచుకొంటూ కాఫీ పూర్తిచేశాడు.

'పాపం మాలతి జీవితం అన్యాయంగా వుందిరా.'

'దిగులయింది. ఏం' అనకుండావుండలేక పోయాడు.

'ఆమె మంచిదే పాపం. అతనికి అనుమానం. కొట్టటం దాకా పోతుంది వ్యవహారం.'

మధు కళ్లలో నీళ్లు తిరిగాయి. ఏమీ అనకుండ లేచాడు. రాజు బిల్లు చెల్లించి వచ్చాడు.

'ఒకరోజు కాలేజీకి మొఖంమీద ఎర్రటి దద్దులతో వచ్చింది. ఆ రోజు గట్టి దెబ్బలు కొట్టాడట.'

మధు వినలేకపోతున్నాడు.

'రమా ఏదో లెక్చరరు ఉద్యోగం నెలగ బెడుతున్నాడుగానీ, ప్రతీనెలా ఒకటో తారీఖున వచ్చి ఆమె జీతం అంతా తీసుకు పోతుంటాడంట. పిల్లల కెప్పుడూ రోగాలు. ఒకసారి నన్ను కూడా అప్పు అడిగింది.

మధు వినలేకపోయాడు.

'ఈ ఏడుపు సంగతులు మాని ఏమయినా సంతోషంగా వుండే సంగతులు చెప్పరా' అంటున్నప్పుడు మధు గొంతు జీరబోవటం రాజు గమనించాడు.

మధు, రాజు కాలేజీలో ఒకే సంవత్సరం ఉద్యోగంలో చేరారు. రెండేళ్లు కలిసి పనిచేయటంతో ఏర్పడిన స్నేహం చాలా గాఢంగా పెరిగింది. అయితే అవమానంగా వుండే ఆ సంగతి రాజుతో ఎప్పుడూ చెప్పలేదు మధు.

ఆరోజంతా అదోమాదిరిగా వున్నాడు. మనస్సు వికల మయిపోయింది.

సాయంకాలం అమ్మతో వచ్చి బట్టలషాపులో చీరెలు చూస్తుంటే ప్రక్కనున్న వ్యక్తి పలకరించాడు.

'బాగున్నారా?'

'ఆఁ!'

'కలకత్తా జీవితం ఏలావుంది?'

'బాగుంది!'

'ప్రమోషన్ వచ్చిందా?'

'వచ్చిది!'

'నన్ను గుర్తుబట్టినట్లు లేరు!'

'అవును, నిజం చెప్పాలంటే, గుర్తు రావటం లేదు. అదే ఆలోచిస్తున్నాను.'

'తిరుపతిలో మీ కజిన్ మాధవమూర్తిగారు పరిచయం జేశారు. రఘురాంని.'

అప్పుడు గుర్తుకు వచ్చింది. రాం చాలా మారిపోయాడు. అతనిప్పుడు గుంటూరులో తాసీల్దారు.

అక్కణ్ణుంచి ఏవేవో మాటలుకి తలాతోకా లేదు. రాం మంచి మాటకారి. పేక బాగా ఆడతాడు. తిరుపతిలో ఉన్న వారం రోజుల్లో బాగా కలిసిపోయాడు. పదేళ్లనాటి సంగతి. బాగా వళ్లువచ్చింది రాంకి. 'ఎప్పుడొచ్చారు!'

'మూడురోజు లయింది.'

అమ్మ చీరెలు తీసుకొని, డబ్బు చెల్లించింది.

'వస్తాం మరి' అంటే 'ఇంటికి ఒకసారి రాకూడదూ' అన్నాడు రాం.

'అలాగే'

'ఎప్పుడొస్తారు. రేపురండి' అంటూ అడ్రను చెప్పాడు.

'మాధవమూర్తిగారు తిరుపతిలోనే వున్నారుకదూ!'

'అవును'

మధు అమ్మతో ఇంటికి వెళ్ళిపోయాడు. తోవపొడుగునా జానకి ఆలోచనలే:

మాధవమూర్తి డిప్యూటీ కలెక్టరుగా డైరెక్టరి క్యూట్... రాం డిప్యూటీ తాసీల్దారు. ఒకప్పటి మైత్రి ఇప్పు...

డిపార్టుమెంటల్‌గా వాళ్లిద్దరికీ స్నేహం! మూర్తి పి. ఏ.టు కలెక్టరుగా గుంటూరు రాబోతున్నాడని రాంకు తెలుసు.

జానకి బాగా పాడుతుంది. కల్చరల్ ప్రోగ్రామ్‌లో తన పాట ముగించి వచ్చిన జానకిని, అభినందించాడు. డ్రమెటిక్ అసోసియేషన్ ప్రసిడెంట్‌గా మధు.

ఆ రోజు ఆమె అప్యాయంగా ఆనందంతో అల్లాడి పోయింది.

మరుసటిరోజు కాలేజీలో మధును పిలిచి 'మీకొక సంతోషకరమయిన సంగతి సార్' అంది.

'ఏమిటి?'

'రాత్రి నాకొక కలవచ్చింది.' నా మెడలో ఒక దండ వుందట. దానికొక రాకెట్ వుంది. అది విప్పి చూస్తే అందులో మీ ఫోటో వుంది.

ఈ పిల్ల కెంత ధైర్యం అనుకొని చుట్టూ ఎవరైనా ఉన్నారేమో విన్నారేమోనని చూశాడు మధు. ఎవరూ లేరు. ఏమీ మాట్లాడకుండా స్టాఫ్‌రూంలోకి వెళ్లిపోయాడు.

అప్పుడామె థర్డ్ బి. ఏ. లో వుంది. ఆ సంవత్సరమే మధు ఉద్యోగంలో చేరాడు.

ఒకరోజు 'మా యింట్లో పార్టీ వుంది. నా పుట్టినరోజు రండి సార్' అంది.

'ఊఁ!' అని నిలబడకుండా వెళ్లిపోయాడు.

రెండోరోజు ఎదురయి 'ఏం మీకింత టెక్కు. రమ్మంటే రాలేదు' మండిపడింది.

నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

ఆ రెండేళ్లల్లో ఆమె చూపిన చొరవ, ఆశించిన ఫలం, జరిగిన అల్లరి తలుచుకుంటే బాధ తప్ప మరేమీ మిగలదు.

ఫైనల్ పరీక్షలు వ్రాసి, ఒకరోజు ఇంటికి వచ్చింది. అమృతో అంతకుముందు ఏం మాట్లాడిందో తెలియదు. మధు వెళ్లేసరికి అతని రూంలో ఫైలు సరిదిద్దుతూ కుర్చుని వుంది.

అతన్ని చూచి లేవలేదు. కూర్చోమంది. బాధగా కళ్లల్లోకి చూచింది. ఏమేమో చెప్పింది. అంతా ప్రేమ గొడవ.

జానకి మాటలు అమ్మ వింటుందేమో ఏమైనా అనుకొంటుందేమోనని భయపడుతున్నాడు.

ఆమె చెప్పిచెప్పి విసిగిపోయి ఏడ్చింది. ఏడుస్తూ లేచింది.

'మీరింత హృదయంలేని మనుష్యులు అనుకోలేదు. మీకు గుండెలేదు. అక్కడ రాతిబండకూడ లేదు. యముడికీ మీకు తేడాలేదు. నేను చస్తాను. మీ రెందుకు ఎవతినో తాటకిని పెళ్లాడండి. పెళ్లాడి మీరేం సుఖపడతారో చూస్తానుగా. నా శాపం మిమ్మల్ని వెంటనంటి వస్తుంది. ఈలోగా నేను చచ్చి, దెయ్యాన్నయి మిమ్మల్ని బాధించి బాధించి వదిలిపెడతాను. నన్ను తృణీకరించి, కనీసం జాలి అయినా లేకుండా మూర్ఖంగా ప్రవర్తించే మీ పాడు మనస్సు ఏనాడో నాశనమయిపోతుంది. నాశనమయి పొండి. చావండి. మీ చావు దెయ్యాన్నిఅయి అయినా చూస్తాను.'

అంతదాకా ఏమీ మాట్లాడని మధువు కోపంగా చూచి, 'థూ!' అని కిటికీలోంచి ఉమ్మివేసింది.

మధు చలించలేదు. ఆమె ముఖాన ఉమ్మి వేసినా కదిలే పరిస్థితిలో లేడు. ఆమె ఎగాదిగా చూచి 'ఛీ! మీరు మగాళ్లే కాదు. మీకు రోషములేదు. మీలాంటివాణ్ణి చేసుకొని ఏ ఆడదీ సుఖపడలేదు' అంటూ చాచి చెంపమీద కొట్టింది.

అది అతని వూహకు అందని విషయం ఆమె కొడుతుందని అనుకోలేదు. 'ఆ ప్రతిభుడై ముఖంలోకి చూస్తూంటే.'

'నన్ను కొట్టరేం నిలువునా చీల్చి పారేయరేం! మీకు సిగ్గులేదూ! అవమానంలేదు. మీరు మనుష్యులేనా? నన్ను చంపండి. చంపి పారేయండి. అలా గుడ్లప్పగించి చూస్తారేం. నన్ను చంపలేరూ?'

కుర్చీమీద పడి ఏడుస్తూవుంది. ఏం చేయాలో అర్థం కాలేదు.

ఏప్రెల్ నెల ఎండలు మండిపోతున్నాయి, కిటికీ వెలుపల.

అర్థంకాని భయం ఆవరించింది. లేచి ఎటయినా పారిపోదామనుకొన్నాడు. కళ్లవెంట నీళ్లు తిరుగుతున్నాయి.

'అమ్మా!' పిలిచాడు మధు. ముఖం తుడుచుకొంటూ.

జానికి లేచింది. ముఖం తుడుచుకొంది. అమ్మ వచ్చేసరికి నవ్వుతూ వుంది. ఎంత మామూలుగా నవ్వుతూ వుందో!

'అత్తమ్మా! నువ్వు మగపిల్లవాణ్ణికాదు కంది. ఆడపిల్లని, ఆడపిల్లకంటే హీనమయిన ఆడపిల్లని.'

బయటికి నడిచించి ఎంతో మామూలుగా వరండ దిగింది. రిక్షా పిలుచుకొని వెళ్లిపోయింది. ఆమె పోయినవైపు చూస్తూ వుండిపోయాడు మధు.

అమ్మ ముఖంలోకి చూస్తే ఆవురుమని ఏడటం తప్ప ఏమీ చెప్పలేదు. ఆమె ఏమీ అడగలేదు.

రిక్షా జిన్నాటరుమీంచి పోతూ వుంది.

'ఏంరా అలా వున్నావు' అమ్మ అడిగింది.

'ఏం లేదమ్మా. కలకత్తానుంచి ఇక్కడికి వచ్చిన నాకూ ఒడ్డునపడ్డ చేపకూ ఎంతో పోలిక వుందమ్మా.'

కళ్లు తుడుచుకొన్నాడు.

'జానకి సంసారం బాగుందిరా'

మధు మాట్లాడలేదు.

'రఘురాం ఆమెనెంతో ప్రేమగా చూచుకొంటాడుట. ఆర్నెల్లక్రితం ఒక మగపిల్లవాణ్ణి కంది. వాడు పుట్టినప్పుడే పన్నెండు పౌనుల బరువు. ఇనుపగుండు ఉన్నట్లు ఉన్నాడు. దొండపండు అంటే నమ్ము, వాళ్ల దాంపత్యం చూడ ముచ్చటగా వుందిరా.

అయినా ఏమీ పలకలేదు, మధు.

'మొన్నవచ్చి నన్ను ఇంటికి తీసుకుపోయి పిల్లవాణ్ణి చూపించింది. ఏమేమో అడిగింది. సంభాషణ అంతా తన కుటుంబం, పిల్లవాడు ఇంతే! చూడాలనిపించే సంసారం'.

'అదృష్టవంతురాలు!'

రిక్షా యింటిదగ్గర ఆగింది. అమ్మాకొడుకు లోపలకి వెళ్లారు.

ఉదయం చూచిన తన గది, సాయంకాలం ఎంతో కొత్తగా కనిపించింది.

పదే పదే ఆమె, పిల్లలూ గుర్తుకు వస్తున్నారు. ఎప్పుడు వెళ్లిపోవటం అనిపిస్తూ ఉంది. ఆ గదిలో వుండలేకపోయాడు.

తొమ్మిదింటికే పడుకొన్నాడు. ఎంతకీ నిద్ర రావటంలేదు. మాలతి, జానకి ఆమె మరచిపోదామన్నా గుర్తుకు వస్తున్నారు.

వెళ్లిపోవలసిందే అనుకొన్నాడు. ఆమెవచ్చేయండి అన్నట్లుగా వుంది. పిల్లలు ఎలా వున్నారో అని చింతన కలిగింది. నిద్రరాక మంచమీద కూర్చున్నాడు.

ఎటూ పాలుపోవడంలేదు. తలంతా నొప్పిగావుంది. రెండో ఆటకు వెళ్లాడు. సినిమా చూడ బుద్ధిరావడంలేదు. మనస్సంతా కలకత్తావైపు మొగ్గింది. సినిమా మధ్యలో లేచి యింటికి వెళ్లిపోయి ముసుగుతున్నాడు. తెల్లవారుజామకు నిద్ర పట్టింది.

ఉదయం జీపులో వచ్చాడు రాం. బ్రేక్‌ఫాస్ట్ మా యింటిలోనే చేయాలి రమ్మని కూర్చున్నాడు.

మధుకు తప్పలేదు.

జీపు యింటిముందాగేసరికి వరండాలో నిలబడి రోడ్డు మీదకు చూస్తున్న జానకి లోపలికి పోయింది.

హాలులోకి ప్రేమతో వచ్చిన జానకిని పరిచేయం చేశాడు.

ఆమె చాలా లావు అయింది. అయితే ఆమెకే ప్రత్యేకమయిన కళ మాత్రం ముఖంలోంచి చెరిగిపోలేదు.

ఆమె మధును నిలువెల్ల చూచి లోపలికి పోయింది.

ఆమె కాఫీ తీసుకువచ్చినపుడు రాం అడిగాడు.

‘నీకు మధుమూర్తిగారు తెలియదా?’

ఆమె ఆతని ముఖంలోకి యదాలోపంగా చూచింది. కాఫీ కప్పులు టేబిల్ మీద పెట్టింది.

'నువ్వు చదువుకొనేటప్పుడు మీ కాలేజీలో పని చేశారు. సైన్సు నీకు లేకపోయినా తెలిసివుండవచ్చు. మాధవమూర్తి గారి కజిన్ బ్రదర్. అంతకంటే వీళ్లిద్దరూ మంచి స్నేహితులు.

ఆమె ఏమీ పలకలేదు.

ఏమంటుందో విందామని ఆసక్తిగా వుంది.

'ఇప్పుడు కలకత్తాలో పని చేస్తున్నారు. మంచి ఉద్యోగం.'

'నాకు తెలియదు. వీరిని ఇప్పుడే చూడటం.'

కాఫీప్లేట్లు తీసుకొని లోపలికి వెళ్లిపోయింది.

మీకూ ఆమె తెలియదా అన్నట్లు చూశాడు రాం.

'కాలేజీలో చూచినట్లు నాకు గుర్తులేదు. అన్నాడు మధు.'

ఆ తర్వాత ఏం మాట్లాడలో తెలియలేదు. గుండెలో ఏదో బాధగా వుంది.

మధు వెళ్లిపోతున్నప్పుడు రాం చెప్పాడు.

'మీ రెప్పుడయినా మాధవమూర్తిగారికి ఉత్తరం వ్రాస్తే మా ఇల్లు పావనం చేసినట్లు తెలియజేయండి. వారి నెంత త్వరగా ఇక్కడ చూడగలనా అని ఆశగా వుంది.

రాంమీద ఏవేవో కరప్షన్ ఛార్జస్ వున్నాయని తర్వాతే తెలిసింది.

జానకిమాత్రం మరుపురాని వ్యక్తిగా దృష్టిలో నిలిచి పోయింది.

మధ్యాహ్నం రాజు దగ్గరకు పోయాడు మధు. ఆదివారం కావటంతో ఇంటిదగ్గరే వున్నాడు. అయిదేళ్లు అయినా రాజుకింకా పిల్లలు కలగలేదు.

వాళ్ల దాంపత్యం చాలా అన్యోన్యంగా కనిపించింది.

'నిన్న సాయంకాలం మాలతి నీ గురించి చాలా సంగతులు అడిగిందిరా.'

సిగరెట్టు కాలుస్తూ చెప్పాడు రాజు.

మధు హృదయంలో ఏదో సంచలనంబయలుదేరి ఆగి పోయింది.

'నిన్ని సాయంకాలం యింటికి తీసుకురమ్మంది.'

రాజు ముఖంలోకి పిచ్చిగా చూచి, తల దించుకొన్నాడు.

'తప్పకుండా తీసుకురమ్మంది.'

మధు మాట్లాడలేదు.

'ఆమె నీకెలా తెలుసు'

వెంటనే చెప్పాడు.

'ఇంటర్‌లో నా క్లామేటు'

అతను మళ్లీ ఏమీ అడగలేదు.

'నువ్వు వూరెప్పుడు వెడుతున్నావు.'

'ఇంకా నిశ్చయించుకోలేదు.'

బాదంఖీర్ తీసుకొంటున్నప్పుడు అడిగాడు.

'నీలో పూర్వపు ఉత్సాహంలేదు. ఏమిటిరా అలావున్నావు.'

గ్లాసు టేబిల్‌మీద పెడుతూ 'మామూలుగానే వున్నాను దరా!'

'లేదు. నీలో ఏదో విచారం వుంది.'

ఏమని చెప్పుకోవటం. మాట్లాడకుండా వూరుకొంటే బాగా వుండదు.

'పిల్లలు గుర్తుకు వస్తున్నారు!'

'అయితే విచారం దేనికి?'

మధు ఏమీ చెప్పలేదు. నిశ్శబ్దంగా నడచిపోతున్నారు.

రోడ్డు మలుపు తిరిగిం తర్వాత 'ఇక్కడే మాలతివాళ్ళ ఇల్లు! వెళ్లదాంరా!'

నడుస్తున్నాడు రాజు.

'నేను రాను.'

ఆగిపోయాడు మధు.

'ఎలా అయినా తప్పకుండా తీసుకు రమ్మందిరా.'

'రాను! రాను! రాను! రాను రాను రాజు నన్ను బాధ పెట్టవద్దు.'

రాజు ముఖంలో ఆశ్చర్యం తప్ప మరేమీ లేదు.

చివరికి తెప్పరిల్లుకొని చెప్పాడు.

'నువ్వు రాకపోతే తనయినా నువ్వుండగా మీ యింటి వస్తుందని. ఆ మాట చెప్పనా?'

'వద్దు! వద్దురా రాజు! ఆమెను నేను చూడలేను మాట్లాడలేను. హృదయంలో ఉన్న ఆనందాన్ని చెరి వేసుకోలేను.'

'అదేమిటిరా!'

'నేను రాను. ఆమె రావద్దు. అప్పుడే అభిమాన మిగిలి వుంటుంది.'

రాజుకు ఏమీ అర్థం కాలేదు.

మధు యింటికి వెళ్ళి అమ్మతో చెప్పాడు.

'ఇవాళ రాత్రి బండికి వెళ్ళిపోతున్నానమ్మా!'

'అదేమిటిరా!'

'పిల్లలు గుర్తుకు వస్తున్నారు. ఇక ఈ వూళ్ళో వుండలేను.'

'పది రోజులు అయినా వుంటానన్న వాడివి అయిదు రోజులయినా కాకముందే...'

మధు జవాబు చెప్పలేదు.

రాత్రి రైలులో వెడుతుంటే, రైలు వూరు బైటికి వచ్చేస్తుంటే కళ్ళలో తిరుగుతున్న నీళ్ళు జల జలా రాలిపోయాయి.

కన్నతల్లివంటి గుంటూరుకు వయస్సు పైబడి మారిపోతుంటే ఆ మార్పు చూడలేక పెంపుడు తల్లిదగ్గరకు వెళ్ళిపోతున్నట్లు బాధపడి, కళ్ళవెంట నీరు ప్రవహిస్తుంటే భార్యా పిల్లలు గుర్తుకు వచ్చి కళ్ళు తుడుచుకొన్నాడు మధు.